# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 236
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
జూన్ 19, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ఘనంగా యోగా వేడుకలు

వైబ్రేంట్ అకాడమీలో నిర్వహణ



8లో..




# విద్యార్థి వీసాల పునరుద్ధరణ

- ప్రకటించిన అమెరికా విదేశాంగ శాఖ
- సోషల్ మీడియా ఖాతాలు పరిశీలిస్తామంటూ షరతు
- వారితో దేశ భద్రతకు ప్రమాదం లేదని నిర్ధారించుకున్నాకే అనుమతి

2లో..



వివరాలు 2లో..

# పనులు కావాలంటే.. చేతులు తడపాల్సిందే

## తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రైవేటు' హవా

- ఉద్యోగులుగా వ్యవహరిస్తున్న దళారులు
- భూ రికార్డులు మాయమయ్యాయనే అనుమానాలు
- వాటాల్లో తేడాలతో ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ
- కలెక్టర్ స్పందించాలంటూ స్థానికుల వేడుకోలు

దామెర తహసీల్దార్ కార్యాలయం కొంతకాలంగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లింది. అక్కడ వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. పనులు కావాలంటే చేతులు తడపాల్సిన పరిస్థితి నెలకొంది. దళారులే ఉద్యోగులుగా వ్యవహరిస్తూ అన్నీ వారే చక్కదిద్దుతున్నారు. ముఖ్యమైన సమాచారమంతా వారి వద్దే అందుబాటులో ఉంటోంది. ధ్రువీకరణ పత్రాలు, గిరిజన పట్టాల పేర్ల మార్పులు, రెవెన్యూ సంబంధిత పనులు సకాలంలో పూర్తి కావాలన్నా ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సిందే. కాదు.. కూడదంటే చెప్పులు అరిగేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే అంటూ పలువురు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. చేతులు తడపందే ఫైలు కదలడం లేదంటూ వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల దందా ఎక్కువ కావడంతో ముఖ్యమైన రికార్డుల భద్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారులకు సంబంధించిన పలు రికార్డులు ఇప్పటికే తారుమారు అయినట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని భూములకు సంబంధించిన రికార్డులు కూడా మాయమైనట్లు సమాచారం. ఇటీవల ఒక రిజిస్ట్రేషన్ కు సంబంధించి మామూళ్ల విషయంలో ఏర్పడిన పంచాయితీ ఎమ్మెల్యే వద్దకు చేరినట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమార్కులపై కొరడా ఝులిపించాలని స్థానికులు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, దామెర



8లో..

## అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ అండ

- నాయిని రాజేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి
- ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు
- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



2లో..

## బనకచర్లతో ఎడారే..!

- అవగాహన లేని రేవంత్, ఉత్తమ్
- వారి వెకిలి మాటలను ఖండిస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యే పెద్ద సుదర్శన్ రెడ్డి

# పనులు కావాలంటే.. చేతులు తడపాల్సిందే

- తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రైవేటు' హవా
- ఉద్యోగులుగా వ్యవహరిస్తున్న దళారులు
- భూ రికార్డులు మాయమయ్యాయనే అనుమానాలు
- వాటాల్లో తేడాలతో ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ
- కలెక్టర్ స్పందించాలంటూ స్థానికుల వేడుకోలు



**వరంగల్ వాయిస్, దామెర :** దామెర తహసీల్దార్ కార్యాలయం కొంతకాలంగా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలు, గిరిజన పట్టాల పేర్ల మార్పులు, రెవెన్యూ సంబంధిత పనులు సకాలంలో పూర్తి కావాలంటే ప్రైవేటు వ్యక్తుల 'చేతులు తడపాల్సిందే'నని వాపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగుల్లా వ్యవహరించడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమైన రికార్డుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. వారికి కావాల్సిన పనులు, పేపర్లు ఇప్పటికే మారిపోయాయని, కొన్ని భూములకు సంబంధించిన రికార్డులు కూడా మాయమైనట్లు సమాచారం.

### పలుకుబడికే ప్రయారిటీ..

ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించడానికి కులం, ఆదాయం, నివాసం, విద్యార్హతలు వంటి నిబంధనలు ఉన్నాయి. ఆయా సర్టిఫికెట్లకోసం మీసేవ ద్వారా చేసుకున్న దరఖాస్తు ఫారాలను రాజకీయ నాయకులు, దళారులు స్వయంగా తీసుకువచ్చి తహశీల్దార్ కార్యాలయంలో తమ డబ్బు, పరపతిని ఉపయోగించి వెంటనే ధ్రువీకరణ పత్రాలు తయారు చేయించుకుంటున్నారు. డబ్బు, పలుకుబడి లేని కొంతమంది మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసినప్పటికీ వారికి ధ్రువీకరణ పత్రాలు రోజుల తరబడి నిలిచిపోతున్నా ఆరోపణలున్నాయి. మరికొందరు చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ ప్రదక్షిన చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. మీసేవ కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను ప్రైవేటు వ్యక్తులు ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఎమ్మెల్యే వద్దకు చేరిన పంచాయితీ..

దామెర తహసీల్దార్ కార్యాలయంలో కొంతమంది అధికారులు, సిబ్బంది కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పాతుకుపోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇటీవల ఒక రిజిస్ట్రేషన్ విషయంలో సిబ్బంది మధ్య ఏర్పడిన వాటాల పంచాయితీ ఎమ్మెల్యే వద్దకు చేరినట్లు చెప్పుకొంటున్నారు. కార్యాలయ సిబ్బంది పెద్దమొత్తంలో డిమాండ్ చేయడంతో సదరు వ్యక్తి నేరుగా ఎమ్మెల్యేకే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. చిలికి చిలికి గాలివానగా మారిన మామూళ్ల వ్యవహారం చివరకు ఆర్డీఓ వద్దకు చేరినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఆర్డీఓ ఏ విధంగా స్పందిస్తారన్నది తెలియాల్సి ఉంది.

### కలెక్టర్ స్పందించాలని విజ్ఞప్తి..

నిత్యం కార్యాలయానికి వెలుతున్న దళారులు అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి పనులు వేగవంతం చేసుకోవడం దామెర తహసీల్దార్ కార్యాలయంలో ఆనవాయితీగా మారింది. దీనివల్ల పద్ధతి ప్రకారం జరగాల్సిన పనులు పక్కదారి పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదవారు, పలుకుబడి లేని వారి పనులు ఆగిపోతూ, ఆలస్యానికి గురవుతున్నాయి. దామెర తహశీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువరు ఉద్యోగులు వసూళ్లకోసం ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నారన్న ప్రచారం సాగుతోంది. అయితే వీరు నిత్యం కార్యాలయంలోని సిబ్బందితో మమేకమవుతూ ముఖ్యమైన రికార్డుల సమాచారాన్ని తెలుసుకొని ప్రైవేట్ వ్యక్తులకు చేరవేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో రెవెన్యూ శాఖకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం బయటకు వెళ్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ రికార్డులకు ప్రమాదం పొంచి ఉందంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.






# కలెక్టర్ హల్ చల్

## ప్రభుత్వ కార్యాలయాల ఆకస్మిక తనిఖీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ స్నేహ శబరీష్ హల్ చల్ చేస్తున్నారు. విధుల్లో చేరినప్పటినుంచి ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఉద్యోగుల్లో గుబులు పుట్టిస్తున్నారు. ఇదే ఒకవడిని గురువారం కూడా కొనసాగిస్తూ పలు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్ లోని పరిపాలన విభాగం, డీ, ఇ సెక్షన్లతోపాటు ఎలక్షన్ సెల్, మినీ కాన్ఫరెన్స్ హోల్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, చైల్డ్ కేర్ సెంటర్, రికార్డ్ రూమ్, ఎన్ఐసీ, వీడియో కాన్ఫరెన్స్ హోల్ ను జిల్లా కలెక్టర్ సందర్శించి అధికారులను కలెక్టర్ పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, కలెక్టరేట్ ఏవో గౌరీ శంకర్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థి వీసాల పునరుద్ధరణ

- ప్రకటించిన అమెరికా విదేశాంగ శాఖ
- సోషల్ మీడియా ఖాతాలు పరిశీలిస్తామంటూ షరతు
- వారితో దేశ భద్రతకు ప్రమాదం లేదని నిర్ధారించుకున్నాకే అనుమతి

**వరంగల్ వాయిస్, వాషింగ్టన్ :** అమెరికాలో చదువుల కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు అగ్రరాజ్యం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన విద్యార్థి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను మళ్లీ ప్రారంభించింది. అయితే, వీసా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సోషల్ మీడియా ఖాతాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామంటూ వెల్లడించింది. ఈమేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. వీసా జారీకి అవసరమైన సామాజిక మాధ్యమ ఖాతాల పరిశీలనకు సన్నాహాలు చేస్తున్నామని, అందుకే వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలోనే తాజాగా సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ల ప్రక్రియను పునరుద్ధరించింది. అయితే సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. ఎవరైనా విద్యార్థి తమ సామాజిక మాధ్యమ ఖాతాలో పాలస్తీనా జెండాను పోస్ట్ చేసినట్లయితే ఆ వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. వారి వల్ల దేశ భద్రతకు ఏ ప్రమాదం లేదని నిర్ధరించుకున్న తర్వాతే వారిని అమెరికా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు అనుమతినిస్తారు. అప్పుడే వారికి విద్యార్థి వీసా లభిస్తుంది. ఇందుకోసం దరఖాస్తుదారులు తమ సోషల్ మీమిడియా ప్రొఫైళ్ల ప్రైవేటు సెట్టింగ్స్‌ను మార్చుకుని 'పబ్లిక్' ఆప్షన్ పెట్టుకోవాలని విదేశాంగ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

# బనకచర్లతో ఎడారే..!

- అవగాహన లేని రేవంత్, ఉత్తమ్
- వారి వెకిలి మాటలను ఖండిస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యే పెద్ద సుదర్శన్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలను ఎడారిగా మార్చే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ద సుదర్శన్ రెడ్డి అన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. గురువారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి, కృష్ణా జలాల గురించి తెలియనివాడు.. తెలంగాణ నీటి వనరులను ఎలా కాపాడుతాడంటూ ప్రశ్నించారు. చిన్న పగుళ్లను సాకుగా చూపించి కాళేశ్వరం కూలిపోయిందంటూ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే కాళేశ్వరంలో నీళ్లు లేకుండా చేసి రైతుల పొలాలను ఎండబెట్టిందన్నారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఓట్లకు ఓట్లకు మధ్య రైతుబంధు ఇస్తూ ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి వేసే డబ్బులు రైతు భరోసా కాదు ఎన్నికల భరోసా అంటూ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వనరులపై కనీసం అవగాహన లేదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీరందించే దేవాదుల ప్రాజెక్టు ఏ బేసిన్ లో ఉందో కూడా వారికి అవగాహన లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ ప్రజలకు హక్కుగా రావాల్సిన నీటి వనరులను కాపాడే చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా స్థానిక మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్యేలు కనీసం నోరు మెదపడం లేదన్నారు. కుట్రపూరితంగా కాళేశ్వరంలో నీటిని నిల్వ చేయకపోవడంతో ఎస్ఆర్ఎస్ లోని డీబీఎం 38 కాల్వ పూర్తిగా ఎండిపోయి రైతుల పొలాలు ఎండిపోయాయన్నారు. రేవంత్ రెడ్డి తన గురువు చంద్రబాబు నాయుడి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాడంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు ఉడతల సారంగపాణి, జోరిక రమేష్, నాయకులు తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్, నార్లగిరి రమేష్, పులి రజనీకాంత్, బండి రజనీ కుమార్, శోభన్ కుమార్, నయీముద్దీన్, సల్వాజి రవీందర్ రావు, జానకి రాములు, అఫ్జల్, రామ్మూర్తి, (పెద్ది) మూటిక రాజు, రాజ్ కుమార్, శరత్ చంద్ర, వీరస్వామి, రాకేష్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# అతివలకు అండగా ఇందిరా మహిళా శక్తి పథకం

**● బచ్చన్నపేటలో వనిత టీ స్టాల్‌ను ప్రారంభించిన కలెక్టర్**



**వరంగల్ వాయిస్, జనగామ:** రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులతో వివిధ యూనిట్లను ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా బచ్చన్నపేట మండలంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పోచన్నపేట గ్రామానికి చెందిన రేణుక అనే స్వయం సహాయక సంఘం (SHG) సభ్యురాలు రచన మహిళా సమైక్య ద్వారా రెండు లక్షల రుణం పొంది ఏర్పాటు చేసుకున్న వనిత టీ స్టాల్‌ను గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన మహిళలకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చేసి, ఒక ప్రణాళికతో, మార్కెట్ డిమాండ్‌ను అనుసరించి సభ్యులు ఈ పథకాన్ని వినియోగించుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా బలపడాలని, కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ స్వయం సమృద్ధి సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. వ్యాపారాన్ని డిమాండ్‌కు తగ్గట్టుగా పెంచుకోవాలని రేణుకకు సూచించారు. అనంతరం కలెక్టర్ వనిత టీ స్టాల్‌లో అందరికీ టీ ఆర్డర్ చేసి, ఆ బిల్లు మొత్తాన్ని యజమాని రేణుకకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో వసంత, మండల స్పెషల్ అధికారి రామారావు నాయక్, ఎంపీడీఓ మల్లికార్జున్, డీటీ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ దురహంకార దాడులు సరికాదు



**◆ నిరసన తెలిపిన వామపక్ష పార్టీల నాయకులు**

**వరంగల్ వాయిస్, వరంగల్:** ఇరాన్‌పై గత ఐదు రోజులుగా అమెరికా సామ్రాజ్యవాద దత్తపుత్రుడు ఇజ్రాయిల్ చేస్తున్న దురహంకార దాడులను నిరసిస్తూ, రాష్ట్ర వామపక్ష పార్టీల పిలుపు మేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి బస్టాండ్ సెంటర్‌లో ఈరోజు ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభకు న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఎంసీపీఐ(యు) జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, సీపీఎం జిల్లా నాయకులు వల్లదాస్ దుర్గయ్య మాట్లాడుతూ, ఇజ్రాయిల్ ఇరాన్‌పై వైమానిక, క్షిపణి దాడులతో ఆ దేశ ప్రభుత్వ నాయకులను, సైనిక అధికారులను, శాస్త్రవేత్తలను, ప్రజలను చంపుతోందని తీవ్రంగా ఖండించారు. ఇది అమెరికా సామ్రాజ్యవాది ట్రంప్ కనుసన్నలలోనే జరుగుతోందని వారు దుయ్యబట్టారు. ఇటీవలి కాలంలో ఇజ్రాయిల్ 55,000 మందికి పైగా పాలస్తీనా ప్రజలను హత్యగావించిందని, పాలస్తీనా ప్రజలు చేస్తున్న పోరాటం న్యాయమైనదని వక్తలు అభిప్రాయపడ్డారు. ఇజ్రాయిల్ చేస్తున్న ఈ మారణహోమం వెనుక అమెరికా, యూరోపియన్ యూనియన్ సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక, ఆయుధ సహకారం ఉందని వారు ఆరోపించారు. ప్రపంచ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఈ దేశాలు పశ్చిమ ఆసియాలోని అరబ్బు దేశాలపై ఆధిపత్యం కోసమే ఈ యుద్ధాన్ని ప్రోత్సహిస్తున్నాయని వారు తెలిపారు. అమెరికా, దాని మిత్రదేశాల దాడులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ప్రజలు ఉద్యమిస్తున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి అక్కినపల్లి యాదగిరి, సీపీఐ(ఎంఎల్) నాయకులు బైరబోయిన ఐలయ్య, ఆర్ఎస్‌పీ పార్టీ కార్యదర్శి వల్లందాస్ కుమార్, మాస్ లైన్ కార్యదర్శి చిర్ర సూరి, ఏఐడీఎస్‌వో నాయకులు మధు, ప్రజా సంఘాల నాయకులు గన్నారపు రమేష్, ఐతం నగేష్, సంఘీ ఎలేందర్, ఆరూరి కుమార్, ఇనుముల కృష్ణలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు

**● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజల ఆరోగ్యం కోసం పతాకంగా నిలిచిన సీఎం సహాయనిధి చెక్కులను పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 63 మంది లబ్ధిదారులకు రూ.28,48,600/- విలువైన చెక్కులు, వరంగల్ మండలానికి చెందిన 5 మందికి రూ.5,00,580/-ల విలువగల కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఎవరికి అయినా ఊహించకుండా వస్తాయి. అటువంటి సమయంలో ప్రభుత్వ మద్దతు అనేది ప్రజలకు వెన్నంటే నిలిచి అండగా ఉంటుంది అని అన్నారు. ఆరోగ్య సమస్య ఎదురైనప్పుడు పార్టీలు, కులాలు, మతాలు అనే భేదాలు ఉండవు. ఒక్క మనిషిగా చూస్తూ, ప్రతి ఒక్కరి ప్రాణాన్ని కాపాడటం కోసం నేనెప్పుడూ అండగా ఉంటాను అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అండగా నిలబడేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స కోసం ఆర్థిక సాయాన్ని అందజేస్తూ వేలాది కుటుంబాలను ఆదుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అధికార యంత్రాంగం పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు..**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. 60వ డివిజన్ వడ్డేపల్లి, 58వ డివిజన్ ఎస్సీ కాలనీ, 57వ డివిజన్ సమ్మయ్యనగర్ కాలనీలో లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి, పనులను ముఖ్య అతిథిగా పాల్గొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని,రాష్ట్రంలో చాలా చోట్ల ఇందిర్మ కాలనీలు ఉంటాయని గుర్తు చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 3500 ఇళ్లకు గాను ప్రతి ఒక్క ఇల్లు నిజమైన అర్హులకు కేటాయించామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇల్లు అనేది ఒక వ్యక్తికి ఆశ్రయం మాత్రమే కాదు – అది గౌరవం, భద్రత, స్వాతంత్ర్యం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ప్రతి పేద కుటుంబానికి ఇంటి కలను సాకారం చేయడమే మా ధ్యేయం అని తెలిపారు. మొత్తం మూడు డివిజన్లలో ప్రారంభించిన ఇండ్ల నిర్మాణ పనులు వందలాది కుటుంబాలకు ఆశ కలిగించాయని తెలిపారు. లబ్ధిదారులు తమ మనసు తల్లడి కళ్లలో ఆనందంతో ఎమ్మెల్యే నాయినిని ప్రత్యేకంగా సన్మానించారు. అంతకు ముందు 60 వ డివిజన్ వడ్డేపల్లి కాలనీలో రూ.5 లక్షలతో కల్వర్ట్ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి




**వరంగల్ వాయిస్, సుబేదారి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన మేరకు బీసీ విద్యార్థులకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించాలనే ప్రధాన డిమాండ్ తో హనుమకొండ ఏకశిలా పార్క్ లో జరిగే బీసీల సత్యాగ్రహ దీక్షని విజయవంతం చేయాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు పిలుపునిచ్చారు. గురువారం దారబోయిన సతీష్ అధ్యక్షతన సుబేదారిలో జరిగిన బీసీ నాయకుల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ శేషు మాట్లాడుతూ ర్యాంకుతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించాలి, పూలే విదేశీ విద్యా జ్యోతి పథకం ద్వారా విదేశాలకి పంపే బీసీ విద్యార్థుల సంఖ్యను 300 నుంచి రెండు వేలకు పెంచాలి, సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్ లతో జరిగే బీసీల సత్యాగ్రహ దీక్షకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కుల సంఘాలు బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు ప్రజా సామాజిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నూతనకంటి ఆనందం, డాక్టర్ పాలడుగుల సురేందర్, డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లాదెళ్లలో ఉచిత ఆరోగ్య శిబిరం



**వరంగల్ వాయిస్, దామెర :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలోని రూరల్ హెల్త్ సెంటర్ లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్, పాలకవర్గం మాట్లాడుతూ లాదెళ్ల గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి 112 మందికి ఉచితంగా మందులు పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.మొహమ్మద్ తయార్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, ఎ.గంగాధర్, ఎండీ.ఖలీం నర్సింహ చారి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులకు అయిలి మారుతి చేయూత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దసరాపు భద్రయ్య, ముత్యాల సంపత్‌కు ఇటీవల బైక్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వారికి తలకు, శరీరానికి తీవ్రమైన గాయాలవడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో దాతల సహకారం కోరగా, ఈ విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి స్పందించారు. వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబానికి మనోధైర్యం కల్పించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఇంచార్జి ఆకుల ప్రతాప్, మొర్రి గణేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# వరంగల్ ఎంజీఎంలో రక్తదానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** భారత భవిష్యత్తు ప్రధాని, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్ పటేల్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురు రక్తదానం చేశారు. అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతి యువజన కాంగ్రెస్ నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంజీఎంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు.

# పిల్లలకు నోట్స్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్అధ్యక్షుడు కేఆర్ దిలీప్ సూచనలతో దామెర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల సుధాకర్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత, ఎంపీరాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం దామెర మండల కేంద్రంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటి మండలంలోని దామెర మరియు ఊరుగొండ, ముస్తాల పెల్లి గవర్నమెంట్ స్కూల్ లో పిల్లలకు నోట్స్ బుక్ పంపిణీ చేసి ఘనంగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దామెర మండల ప్రధాన కార్యదర్శి భిక్షపతి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, మండల్ యూత్ ప్రధాన కార్యదర్శి గడాల నరేష్, కార్యదర్శి రతన్, ఉపాధ్యక్షులు జంగిల్ వెంకటేష్, జల్ల ప్రవీణ్, మాజీ సర్పంచి దుబ్బాసి రాజేందర్, జన్ను రామచందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాసమల్ల కిరణ్, పోలేపాక భిక్షపతి, పోలేపాక ప్రశాంత్, గడ్డం వెంకటేష్, దామెర సతీష్, సదిరం లింగయ్య, గొల్లపల్లి శ్రీను, కచ్చకాయల అరుణ, సిల్వర్ రణధీర్, దండు రాహుల్, జన్ను కుమార్, మండల ఎంఈఓ లకావత్, రాకేష్ కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రదీప్ రావు జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్:** బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం 26వ డివిజన్‌లోని లక్ష్మీపురం గవర్నమెంట్ హైస్కూల్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా గిర్మాజీపేట్ మండల అధ్యక్షుడు ముత్తినేని లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి యువ నాయకులు ఎర్రబెల్లి వినీత్ కుమార్, బీజేపీ జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎర్రబెల్లి ప్రదీప్ రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వారి జన్మదినం సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో జరిపి ఆదర్శప్రాయంగా నిలవాలని విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు ఎస్. సి. మోర్చా జిల్లా అధ్యక్షులు మార్టిన్ లూథర్, మండల అధ్యక్షులు సీత నాగరాజు, ఆడెపు ప్రసాద్, వంగళ శ్రీనివాస్, చింతం మహేందర్, వంగరి కేశవ్, దొడ్డ ప్రశాంత్, కుడికాల కిషన్, భీం నవీన్, పేరాల భాస్కర్, రామ నాగార్జున, మారుముళ్ల ప్రవీణ్, మంతెన అనిత, రాయబరపు సంతోష్, రమేష్, నగేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షకుడు రాహుల్ గాంధీ

## ● ఘనంగా జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** దేశంలోని సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ప్రజల పక్షాన నిలబడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఏఐసీసీ అగ్ర నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా రాహుల్ గాంధీ అందరికీ చేరువై అన్ని వర్గాల సమస్యలను తెలుసుకున్నారని, తెలంగాణలో కులగణన ద్వారా అన్ని వర్గాలకు న్యాయం చేశారని కొనియాడారు. రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, యువజన విభాగం, మహిళా అధ్యక్షురాలు, యువజన కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సేవాదళ్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హుజురాబాద్ పట్టణ పరిధిలోని 15వ, 17వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పట్టాలను అందజేశారు.

# రాహుల్ గాంధీ స్ఫూర్తితోనే రాష్ట్రంలో కులగణన



**వరంగల్ వాయిస్, శాయంపేట:** భారత దేశ భావి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు జోడో యాత్ర చేసి దేశాన్ని సంఘటితం చేశారని కొనియాడారు. యూపీఏ హయాంలో రెండుసార్లు ప్రధాని పీఠాన్ని అధిరోహించే అవకాశం వచ్చినప్పటికీ, తృణప్రాయంగా పదవిని వదులుకున్న గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కులగణన అనే అంశాన్ని తీసుకువచ్చిన గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో కులగణన నిర్వహించడం జరిగిందని అన్నారు. కేవలం రాహుల్ గాంధీ సూచన మేరకే కేంద్ర ప్రభుత్వం దేశంలో కులగణన చేయాలని నిర్ణయించిందని ఆయన గుర్తు చేశారు. రాబోవు రోజుల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసని చంద్రప్రకాష్, మారపల్లి రవీందర్, చిందం రవి, వైనాల కుమారస్వామి, దుబాసి కృష్ణమూర్తి, నిమ్మల రమేష్, వెంకటరాజి రెడ్డి, చింతల రవిపాల్, మామిడిపల్లి సాంబయ్య, గజ్జి ఐలయ్య, వరదరాజు మార్కండేయ, మారపల్లి రాజేందర్, వల్పదాసు రాము, చిరంజీవి, రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, రేపటి దేశ భవిష్యత్తు యువ నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పర్వతగిరి, చౌటపల్లి, గుంటూరుపల్లి, ఏనుగల్, కొంకపాక, అన్నారం గ్రామాలకు చెందిన విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు బుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2004, 2009లో రెండు పర్యాయాలు ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత రాహుల్ గాంధీకి దక్కుతుందన్నారు. దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా దేశవ్యాప్తంగా ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు "భారత్ జోడో యాత్ర" పేరుతో పాదయాత్ర చేసిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనన్నారు. భారత దేశ ప్రజలను ఏకం చేయడం, వారి సమస్యలను వినడం లక్ష్యంగా పెట్టుకొని యాత్రను విజయవంతం చేసుకుని, కోట్ల మంది గుండెల్లో ధైర్యం అనే జెండాను నాటి అండగా నిలుస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, యువకిశోరుడు రాహుల్ గాంధీ మాత్రమే అని కొనియాడారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఉపాధ్యక్షులు బొక్కల ప్రమోద్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల అధ్యక్షులు గొడుగు వినయ్ కుమార్, పర్వతగిరి పట్టణ అధ్యక్షులు కూసం రామచందర్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు భూక్య సురేందర్, సర్వర్, చల్లా వెంకన్న, బోట్ల వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు నూనె మణికంఠ, లోకేష్, రంజిత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరం

## ● పరకాలలో ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, పరకాల:** దేశ ప్రజలకు రాహుల్ గాంధీ నాయకత్వం అత్యవసరమని, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అడ్డుకొని ప్రజలను రక్షించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ ప్రజల ఐక్యత కోసం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా ఎంతో కృషి చేశారని కొనియాడారు. యాత్రలో ఇచ్చిన హామీ మేరకు జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కులగణనకు ఆమోదం తెలిపేలా రాహుల్ గాంధీ కృషి చేశారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను పెంచి పేదవారిపై భారం మోపుతోందని, దేశంలో కుల, మతాల గొడవలు సృష్టించి ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తోందని ఆయన విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకొని పార్లమెంటులో ప్రజల పక్షాన నిలిచిన గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ అని కొయ్యడ శ్రీనివాస్ ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశ ప్రజలకు రక్షణ, సంక్షేమ పథకాలు అందుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సేవాదళ్ అధ్యక్షుడు బొచ్చు చందర్, సమన్వయ కమిటీ సభ్యులు చిన్నాల గోనాథ్, ఎండీ రంజాన్ అలీ, పోరండ్ల సంతోష్, మేరుగు శ్రీశైలం, బండి సదానందం, చందుపట్ల రాఘవరెడ్డి, నల్లెల్ల అనిల్, మార్క రఘుపతి గౌడ్, దుబాసి వెంకటస్వామి, జాఫర్ రిజ్వి, వొంటేరు శ్రావణ్ కుమార్, పోరండ్ల వేణు, మంద నాగరాజు, పబ్బ శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనివాస్, జంగలి సతీష్, గడ్డం శివ, బొచ్చు శ్రీధర్, జెమిని, బొమ్మకంటి చంద్రమౌళి, దొమ్మటి నాని, అల్లం శ్రీరామ్, ఏకు రవికుమార్, దుప్పటి సాంబశివుడు, బండారు కృష్ణ, కోటి తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా, ఇరాన్ ప్రజలపై మారణహోమాన్ని ఆపాలి

## ● వామపక్ష పార్టీల నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పాలస్తీనా, ఇరాన్ ప్రజలపై సామ్రాజ్యవాద అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని, దాడులను తక్షణమే నిలిపివేసి శాంతిని నెలకొల్పాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు రాగుల రమేష్, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఆర్ఎస్పీ జిల్లా నాయకులు కౌడగాని శివాజీ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్), ఆర్.ఎస్.పీ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాలస్తీనా, ఇరాన్ దేశాలపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని కోరుతూ నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సీపీఐ నాయకులు తోట భిక్షపతి, సీపీఐ(ఎం) నాయకులు వెంకట్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు రాగుల రమేష్, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు దయాకర్, ఆర్.ఎస్.పీ జిల్లా నాయకులు శివాజీ మాట్లాడుతూ, అమెరికా సామ్రాజ్యవాద మద్దతుతో గత 20 నెలలుగా ఇజ్రాయిల్ పాలస్తీనాపై, ఈ మధ్య కాలంలో ఇరాన్‌పై చేస్తున్న యుద్ధోన్మాద మారణహోమం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల వల్ల పాలస్తీనాలో 55 వేల మందిని ఇజ్రాయిల్ సైన్యం చంపడం జరిగిందని వారు పేర్కొన్నారు. జాతుల సమస్యలు, ప్రాంతాల సమస్యలు అణు యుద్ధాలకు దారి తీయకుండా చర్చల ద్వారా పరిష్కరించబడాలని, అందుకు మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు వచ్చి అమెరికాతో, ఇజ్రాయిల్‌తో మాట్లాడి శాంతి చర్చల వైపు నడిపించాలని వారు హితవు పలికారు. ఇజ్రాయిల్ దాడులను ఆపాలని ఐక్యరాజ్యసమితి కోరినప్పటికీ, ఆ విషయాన్ని ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టడం చూస్తుంటే అమెరికా సామ్రాజ్యవాద వత్తాసు ఇజ్రాయిల్‌కు ఉండటమే ప్రధాన కారణమని, ఈ సమస్య కేవలం మూడు దేశాల మధ్య సమస్య కాదని, ఇది ప్రపంచ సమస్య అని వారు అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సన్నిహితుడిని అని చెప్పుకునే మోడీ పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ దాడులను ఆపి ప్రపంచ శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మండ సదాలక్ష్మి, ఎన్.ఎ. స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, భాషబోయిన సంతోష్, ఏదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, నేదునూరి రాజమౌళి, మునిగాల భిక్షపతి, వేల్పుల సారంగపాణి, యేషబోయిన శ్రీనివాస్, సీపీఐ (ఎం) జిల్లా నాయకులు బొట్ల చక్రపాణి, గుగులోత్ వీరన్న, లింగయ్య, తిరుపతి, సీపీఐ(ఎంఎల్), ఆర్.ఎస్.పీ నాయకులు పాల్గొన్నారు.

# దశాబ్దాల నిరీక్షణకు తెర

## కాసింపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తమ సొంత ఇంటి కల నెరవేరడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్ళలో ఆనందం వెల్లివిరిసింది. కమలాపూర్ మండలంలోని కాసింపల్లిలో తొమ్మిది మంది లబ్ధిదారులకు శుక్రవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముగ్గు వేసి, కొబ్బరికాయ కొట్టి, ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను ఇక్కడికి వచ్చినప్పుడు గుడిసెల్లో నివసిస్తున్న వారిని చూశానని గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతలో ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. మరో విడతలో మరిన్ని ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. మండలానికి కూతవేటు దూరంలో ఉండి, అప్పుడు మంత్రిగా, ఎమ్మెల్సీగా ఉన్నవారు కనీసం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేకపోయారని, తాము ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను ఇస్తున్నామని ఆయన నొక్కి చెప్పారు. అనంతరం, ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన దేశరాజ్‌పల్లి గ్రామంలోని 150 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రణవ్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణం ఎలా జరుగుతోందని, డబ్బులు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఝాన్సీ, డైరెక్టర్లు, కమలాపూర్ మండల నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ప్రణవ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రణవ్ నాయకత్వాన్ని బలపరుస్తామని నూతనంగా చేరినవారు తెలిపారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ సోదరుడు, ఆర్మీ ఉద్యోగి అరికిల్ల ప్రవీణ్ మృతి చెందగా భూపాలపల్లి మాజీ శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణా రెడ్డి, వరంగల్ రూరల్ మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్, బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా శాయంపేట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి గురువారం ప్రవీణ్ స్వగృహానికి వెళ్లి, పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్‌శెట్టి లక్ష్మారెడ్డి, దాసి శ్రావణ్ కుమార్, సావుళ్ల కిష్టయ్య, నర్ర రాజు, అర్జల సాంబరెడ్డి, కొమ్ముల శివ, కుతాటి రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ'




**వరంగల్ వాయిస్, పరకాల:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభను పట్టణ బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్ర రావు, రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గ అభ్యర్థి పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, గుజ్జా సత్యనారాయణ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ అద్భుత నాయకత్వంలో సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమ మార్గంలో భారత్ ప్రతి సవాల్‌ను ధైర్యంగా ఎదుర్కొందని ప్రశంసించారు. మన సైనికుల సాహసంతో సరిహద్దులు సురక్షితంగా ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలో అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత్ అభివృద్ధి చెందుతున్న బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్" అనే మంత్రంతో ప్రతి పౌరుడిని అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చారని రామచంద్రరావు అన్నారు. దేశం మొత్తం వికసిత్ భారత్ లక్ష్యం చేరుకునే దిశగా ఏకతాటిపై ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీ జయంత్ లాల్, చందుపట్ల రాజేందర్ రెడ్డి, కూతురు రాజు, రూరల్ మండల అధ్యక్షుడు కాసాగాని రాజకుమార్, నడికూడ మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్, మార్త రాజభద్రయ్య, బెజ్జంకి పూర్ణ చారి, ఎర్ర రామన్న, మేకల రాజా వీరు, దార్నా నారాయణదాసు, కుక్కల విజయ్, సంఘ పురుషోత్తం, మార్త భిక్షపతి, బండి రవి, కొమ్మిడి మహేందర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, ఇతర బీజేపీ కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు పారితోషికం

## ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు



**వరంగల్ వాయిస్, పరకాల:** 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పరకాల ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అభినందనలు తెలియజేస్తూ నగదు పారితోషికం, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన తన తల్లిదండ్రులు పెద్ది బాలమణి చంద్రమౌళి జ్ఞాపకార్థం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమం ద్వారా మార్కులు సాధించిన విద్యార్థులలో పరకాల బాలికల పాఠశాల నుండి ఎం. వర్షిత (557 మార్కులు), జడ్పీహెచ్ఎస్ నాగారం నుంచి వి.విఘ్నేష్ (530 మార్కులు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి సీహెచ్.అజయ్ (455 మార్కులు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పరకాల నుంచి జి.రవితేజ (453 మార్కులు), జడ్పీహెచ్ఎస్ వెల్లంపల్లి నుంచి చిన్నారి (370 మార్కులు) వీరిలో ప్రతి ఒక్కరికీ ఎంపీడీవో వెయ్యి రూపాయల నగదు పారితోషికంతో అందించి సన్మానించారు. ఈ సందర్భంగా పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ తన తండ్రి ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మరణించడం వల్ల తనకు ఈ ఉద్యోగం వచ్చిందని, తన తండ్రి ఆశయాలను నెరవేర్చే దిశగా విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మండల విద్యాశాఖ అధికారి ఎస్. రమాదేవి, మండల నోడల్ అధికారి శ్రీ నామిని సాంబయ్య, ప్రధానోపాధ్యాయులు సీహెచ్. మధు, సీహెచ్. సురేందర్ తో పాటు ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖకు అనునిత్యం వెన్నుదన్నుగా నిలిచి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎంపీడీవోకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## శాయంపేటలో 21న ఎంపిక పోటీలు

**వరంగల్ వాయిస్, శాయంపేట:** క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల నిమిత్తం మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 21న శాయంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారి జి. భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో పాల్గొనడానికి అర్హులైన విద్యార్థులు 01.09.2016 నుంచి 31.08.2017 మధ్య జన్మించి ఉండాలి. అలాగే, మూడవ తరగతి పూర్తి చేసి నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులందరూ ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనవచ్చని ఆయన స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం 9848506098 లేదా 9912796596 నంబర్‌లను సంప్రదించవచ్చు.


# మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులకు బీఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం



**వరంగల్ వాయిస్, శాయంపేట:** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అమెరికాలో దిగ్విజయంగా నిర్వహించి, స్వదేశానికి తిరిగి వచ్చిన వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి దంపతులకు ఘన స్వాగతం లభించింది. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో శాయంపేట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, రామ్‌శెట్టి లక్ష్మారెడ్డి, వంగల నారాయణరెడ్డి, గంట శ్యాంసుందర్ రెడ్డి, దాసి శ్రావణ్ కుమార్, మేకల వెంకటేశ్వర్లు, సావుళ్ల కిష్టయ్య, మారెపల్లి నందం, ఎండి మొహిబుద్దీన్, దైనంపల్లి కరుణ్ బాబు, నర్ర రాజు, దైనంపల్లి సుమన్, మారెపల్లి మోహన్, గాదె రాజేందర్, గడిపే విజయ్, రంగు మహేందర్, కొమ్ముల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# నేరుగా ఓటీటీలోకి..




ఇండస్ట్రీలో కొన్ని కలయికలను అసలు ఎవరూ ఊహించలేం. అలాంటి కలయికల్లో ఒకటి సుహాస్, కీర్తి సురేష్. వీరిద్దరి కాంబోలో 'ఉప్పు కప్పురంబు' అనే సినిమా తెరకెక్కిన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా ఆహ్లాదకరంగా, సెటైరికల్ గా ఉంటునే ఆడియన్స్ ను ఎంతో ఆలోచింపచేసేదిగా ఉండనుందట.కాగా ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ కానుంది. ఇప్పటికే ఓటీటీ రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేశారు మేకర్స్ జులై 4 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 240కు పైగా దేశాల్లో ప్రైమ్ వీడియోలో స్పెషల్ గా ప్రీమియర్ కానున్నట్లు తెలిపారు. . కాగా ట్రైలర్ గనుక పరిశీలిస్తే.. ఊరి స్మశానంలో ఇంకా కేవలం నలుగురికి మాత్రమో చోటు ఉంటుంది. ఊరి పెద్దగా అధికారంలోకి వచ్చిన కీర్తి సురేష్‌దాని ఎలా సాల్వ్ చేసింది? అనేది స్టోరి. కాగా విలేజ్ డ్రాప్ లో పూర్తి ఎంటర్ టైనింగ్ మూవీ గా వస్తున్న ఈ మూవీలో కీర్తి లుక్ మొత్తం మార్చేసింది. చాలా రోజులకు బాబుమోహాన్ మంచి కం బ్యాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సుహాస్ కూడా మంచి కామెడీ టైమింగ్ తో ఆకట్టుకున్నారు.

# కుబేర
## మూవీ విడుదల

ఏపిలో టిక్కెట్ల పెంపుపకు అనుమతి

నాగార్జున, ధనుష్, రష్మిక కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' శేఖర్ కమ్ముల దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 20న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో రూ.75 వరకు పెంచుకునే వెసులుబాటు కల్పించింది. సినిమా విడుదలైన తేదీ నుంచి 10 రోజుల పాటు ఈ ధరలు అమల్లో ఉండనున్నాయి. మరోవైపు తెలంగాణలో మాత్రం టికెట్ ధరల విషయంలో ఎలాంటి మార్పు లేదు. ఈ విషయమై చిత్ర బృందం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేదని సమాచారం. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో టికెట్ ధరలు యథాతథంగా ఉండనున్నాయి.


ఇక 'కుబేర' మూవీ రన్‌టైమ్ అందరినీ ఆశ్చర్య పరుస్తోంది. సెన్సార్‌బోర్డు ఈ మూవీకి యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. బోర్డు సూచనల మేరకు మార్పు చేర్పులు చేసిన తర్వాత 182 నిమిషాల 38 సెకన్ల నిడివితో 'కుబేర' థియేటర్స్‌లో విడుదల కానుంది. అంటే 3 గంటల 2 నిమిషాలకు పైనే మూవీ రన్‌టైమ్ ఉండటం గమనార్హం. ఇప్పటివరకూ అగ్ర కథానాయకులు, భారీ విజువల్ ఎఫెక్ట్స్ కలిగిన చిత్రాలు మాత్రమే 3 గంటలకు పైన ఉన్నాయి. సోషల్ డ్రామా ఈ స్థాయిలో రన్‌టైమ్ కలిగి ఉండటం సినిమా కంటెంట్‌పై టీమ్‌కు ఉన్న నమ్మకాన్ని చెప్పకనే చెబుతోంది. మూడు గంటల పాటు శేఖర్ కమ్ముల ఏం చెప్పబోతున్నారా? అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అలాగే తెలుగు, తమిళ వెర్షన్ రన్‌టైమ్‌లో స్వల్ప మార్పు ఉంది. తెలుగులో ఒక నిమిషం నిడివి తక్కువతో థియేటర్‌లో ప్రదర్శితం కానుంది. ఈ విషయాన్ని స్వయంగా దర్శకుడు శేఖర్ కమ్ముల వెల్లడించారు. సాంకేతికంగా ఏర్పడిన సమస్య కారణంగా అలా కట్ చేయాల్సి వచ్చిందని, ఈ మార్పు కథపరంగా ఎలాంటి ప్రభావం చూపదని తెలిపారు.




## రైతు కూడబెట్టిన 2లక్షల బుగ్గిపై ప్రస్తావన

### కుబేర ప్రమోషన్లలో శేఖర్ కమ్ముల

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం కుబేర. తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా వైడ్‌గా ఈ చిత్రం జూన్ 20న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు దర్శకుడు శేఖర్ కమ్ముల. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన 2021లో జరిగిన ఒక సంఘటన గురించి పంచుకున్నాడు. కూతురి పెళ్లి కోసం ఒక రైతు 2 లక్షలు దాచుకోగా.. ఆ డబ్బు మంటల్లో కాలిపోతే శేఖర్ కమ్ముల అతడికి ఆర్థిక సహాయాన్ని అందించాడు. విషయం గురించి తాజాగా మాట్లాడుతూ.. కూతురి పెళ్లి కోసం ఓ రైతు దాచుకున్న డబ్బు కాలిపోయిందని తెలిసి నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎంతో కష్టపడి సంపాదించిన ఆ డబ్బు అలా కాలిపోవడం నన్ను తీవ్రంగా కలిచివేసింది. బాగా డబ్బున్నవాడికి నోట్ల కట్టలు మంటల్లో కాలిపోతే కేవలం బాధేస్తుంది, అలాంటిది ఒక పేద రైతు కష్టపడి సంపాదించిన డబ్బు అలా కాలిపోతే అతడి బాధేంటే అర్థం చేసుకోనవసరం లేదు. అతడి కష్టం ఇలా వృధా అవ్వడం నా మనసును బాగా కదిలించింది. అందుకే ఆ రైతుకు నా వంతు సహాయంగా రూ.2లక్షలు పంపించాను. అంటూ శేఖర్ చెప్పుకొచ్చాడు. అసలు ఏం జరిగిందంటే.. 2021లో సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, నేలమర్రికి చెందిన కప్పల లక్ష్మయ్య అనే రైతు పూరిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఈ ఘటనలో ఆయన తన కూతురి పెళ్లి కోసం బీరువాలో దాచుకున్న 2 లక్షల రూపాయల నగదు మంటల్లో కాలిపోయాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న దర్శకుడు శేఖర్ కమ్ముల చలించిపోయారు. వెంటనే స్పందించి, లక్ష్మయ్య కుటుంబానికి అండగా నిలిచారు. నేరుగా రైతు బ్యాంక్ ఖాతాకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని పంపించారు. అంతేకాకుండా, లక్ష్మయ్య కుటుంబంతో స్వయంగా మాట్లాడి, అవసరమైతే మరింత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా కూతురి పెళ్లిని మంచిగా, సంతోషంగా జరిపించాలని కోరారు.






## 8 వసంతాలతో
### లక్ పరీక్షించుకోనున్న కేరళ కుట్టి

మలయాళ ఇండస్ట్రీ నుండి ఎంతో మంది ముద్దుగుమ్మలు టాలీవుడ్‌లో తమ లక్ పరీక్షించుకునేందుకు వస్తుంటారు. అలా వచ్చిన మరో ముద్దుగుమ్మ అనంతిక సనిల్ కుమార్. 15 ఏళ్లకే యాక్టింగ్ కెరీర్‌లోకి అడుగుపెట్టింది ఈ కేరళ కుట్టి. బేసికల్లీ క్లాసిక్ డ్యాన్సర్. యాక్టింగ్ పై ప్యాషన్‌తో నటనవైపు అడుగులేసిన అనంతిక రాజమండ్రి రోజ్ మిల్క్ చిత్రంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది. మ్యాడ్‌లో నార్నే నితిన్‌కు జోడీగా నటించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. కానీ ఆ ఆనందాన్ని మిగల్చేదు తమిళ ఇండస్ట్రీ. కోలీవుడ్‌లో నటించిన రెండు చిత్రాలు రైడ్, లాల్ సలామ్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. దీంతో కెరీర్ డైలామాలో పడిపోతున్న టైంలో వచ్చిందే 8 వసంతాలు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 8 వసంతాలు మరికొన్ని గంటల్లో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించబోతోంది.

## పెద్ది నుంచి మరోలుక్..




ఓటిటిలో సంచలనంగా నిలిచిన 'మిర్జాపూర్' సిరీస్ ఫేమ్.. మున్నా భయ్యా అంటేనే గుర్తుకు వచ్చే దివ్యేంద్ర శర్మ ఈ సినిమాలో కీలక పాత్రతో నటిస్తున్నాడు. తాజాగా మేకర్స్ మున్నా భయ్యా పుట్టినరోజు సందర్భంగా మరో స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో దివ్యేంద్ర క్రికెట్ బాల్ పట్టుకుని మాస్ లుక్‌లో పవర్‌ఫుల్ అవతారంలో కనిపిస్తున్నాడు. కాగా అతను ఈ సినిమాలో 'రామ్ బుజ్జి' అనే పాత్రలో కనిపించనున్నారని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికి ఈ పోస్టర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతుండగా ఫ్యాన్స్‌లో హైప్ పెంచేస్తోంది. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న గ్రాండ్‌గా విడుదల కానుంది.

# అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ అండ

- నాయిని రాజేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి
- ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు
- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్వతంత్ర భారత దేశంలో అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి వెల్లడించారు. పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రాహుల్ గాంధీ జన్మదినం ఓ వరం కావాలని అభిలషించారు. రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వతంత్ర దేశం నుంచి నేటి వరకు ఈ దేశం కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న ఏకైక కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమని కొనియాడారు. అట్టడుగు వర్గాలకు అండగా కాంగ్రెస్ నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్ లాంటి ఎన్నో పథకాలతో నేడు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**కాశిబుగ్గ సెంటర్ లో..**

కాశిబుగ్గ సెంటర్ లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత లోక్ సభ సభ్యులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేందర్ కుమార్, బస్వారాజు శిరీష శ్రీమన్, మాజీ కార్పొరేటర్లు దామెర సర్వేశం, జన్ను అరుణ్, తత్తరి లక్ష్మణ్, ధూపం సంపత్, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్, వరంగల్ తూర్పు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి సలీం, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కుసుమ వరుణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోరంటల రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సేవాదళ్ రామ్ సింగ్, మోహన్, ఎండి సాదిక్, రాముల బాబు, అందే సునీల్, వస్కుల ఉదయ్, తోట బాలరాజు, జన్ను వేణు, పెండ్యాల కొమురయ్య, గుండేటి సతీష్, చిరంజీవి, సందేల దామోదర్, గజ్జెల లింగమూర్తి, కొమ్ము రాజకుమార్, రాచర్ల కుమార్, బుర్ర నటరాజ్, ఉమేందర్, జన్ను శ్యామ్, బండ్ల సురేందర్, వేణు, వెల్దండి వరుణ్, ఎండీ ఇమ్రాన్, శేఖర్, సిరిసిల్ల శ్రీనివాస్ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఘనంగా యోగా వేడుకలు

- వైబ్రేంట్ అకాడమీలో నిర్వహణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ముందస్తు వేడుకలను గురువారం నక్కలగుట్టలోని వైబ్రేంట్ అకాడమీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ విద్యార్థులతో ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, వివిధ ఆసనాలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకే భూమి – ఒకే ఆరోగ్యం అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించడం భారతీయులుగా మనం గర్వించదగిన విషయమన్నారు. ఈ దేశంలో పుట్టిన యోగా విశ్వవ్యాప్తం చేయడం ఎంతో అవసరమన్నారు.యువత యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుందన్నారు. తద్వారా శక్తివంతమైన భారతావని వృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల, తిరుపతి దేవస్థానం కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి, వైబ్రేంట్ అకాడమీ చైర్మన్ సీహెచ్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ టి.శేషు కుమార్, టి.సహజ, జి.షామిలి, గుమ్మడి రామ్, యోగా సాధకులు శ్రీవిద్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## తపాలా కార్యాలయాల్లో రైతుభరోసా విత్ డ్రా

**హనమకొండ సూపరింటెండెంట్ వి.హనుమంతు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రైతుల ఖాతాల్లో జమ అయిన రైతు భరోసా డబ్బులను హనుమకొండ తపాలా పరిధిలోని హనుమకొండ, జనగామ, భూపాలపల్లి, ములుగు, సిద్దిపేట జిల్లా పరిధిలోని కొంత ప్రాతంలో ఉన్న తపాలా కార్యాలయాల్లో విత్ డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు హనుమకొండ తపాలా సూపరింటెండెంట్ వి.హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తపాలా కార్యాలయాల్లో మీ రైతు భరోసా నగదును విత్ డ్రా చేసుకోవాలని సూచించారు.

## రూ.119.42 కోట్ల రైతు భరోసా నిధులు జమ

- జిల్లాలో 1,41,727 మంది రైతులకు లబ్ధి
- జిల్లా వ్యవసాయ అధికారి రాజమణి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో గురువారం ఉదయం 10 గంటల వరకు 1,41,727 మంది రైతుల ఖాతాల్లో రూ.119.42 కోట్ల నిధులు విజయవంతంగా జమ అయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి రాజమణి తెలిపారు. దీంతో రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యం మరోసారి రైతు భరోసా నిధుల విడుదలతో వెల్లడైందన్నారు. 2025 వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న ఈ సమయంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచేలా ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేయడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ నిధుల ద్వారా విత్తనాలు, ఎరువులు, ఇతర సాగు అవసరాలు తీర్చుకోవచ్చన్నారు. రైతులకు మద్దతు ధర లభించడంతో ముందుగానే అవసరమైన వ్యవసాయ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారన్నారు. సాగుకు ముందు పెట్టుబడి సాయంగా రైతులకు రైతు భరోసా నిధులు అందడం ఎంతో మేలు జరుగుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని రాజమణి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 1,65,184 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్దిపొందేందుకు అర్హులుగా గుర్తించామన్నారు. వ్యవసాయ అధికారులు, బ్యాంకర్ల సమన్వయంతో ఈ పంపిణీ సమర్థవంతంగా కొనసాగుతోందని ఆమె వెల్లడించారు.

**వివరాలు ఇలా..**

చెన్నారావుపేట మండలంలో 10,286 మంది రైతులకు రూ.8.81 కోట్లు, దుగ్గొండి 13,491 మంది రైతులకు రూ.10.81 కోట్లు, ఖానాపూర్ 8,072 మంది రైతులకు రూ.7.02 కోట్లు, నల్లబెల్లి 12,213 మంది రైతులకు రూ.10.68 కోట్లు, నర్సంపేట 11,275 మంది రైతులకు రూ.8.16 కోట్లు, నెక్కొండ 13,538 మంది రైతులకు రూ.11.85 కోట్లు, గీసుగొండ 11,850 మంది రైతులకు రూ.9.58 కోట్లు, ఖిలా వరంగల్ 4,355 మంది రైతులకు రూ.2.81 కోట్లు, పర్వతగిరి 12,487 మంది రైతులకు రూ.11.06 కోట్లు, రాయపర్తి 16,644 మంది రైతులకు రూ.15.61 కోట్లు, సంగెం 13,562 మంది రైతులకు రూ.11.49 కోట్లు, వరంగల్ 1,565 మంది రైతులకు రూ.1.41 కోట్లు వర్ధన్నపేట 12,049 మంది రైతులకు రూ.10.43 కోట్ల రైతు భరోసా నిధులు వారి ఖాతాలలో జమ చేశామని జిల్లా వ్యవసాయ అధికారి రాజమణి తెలిపారు.



## మహిళా డ్రైవర్ పలువురికి ఆదర్శం

**సరితను ఘనంగా సన్మానించిన మంత్రి సురేఖ**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సరిత ఈ దేశంలోని ఎంతోమంది మహిళలకు ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం డ్రైవర్ సరిత జూబ్లీహిల్స్ లోని మంత్రి సురేఖ స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సరితను శాలువాతో మంత్రి ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరింత రాణించాలని అభిలాషించారు. ఈ నేపథ్యంలో సరిత తన కుటుంబ సమస్యలు మంత్రి సురేఖకు నివేదించగా, ఎటువంటి సమస్యలున్నా తనను సంప్రదించాలంటూ భరోసా కల్పించారు. దీంతో సరిత మంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## తూర్పులో రాహుల్ జన్మదిన వేడుకలు

తూర్పు నియోజకవర్గంలోని పోచం మైదాన్ జంక్షన్ లో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ద్వారా అందరికీ చేరువై అన్ని వర్గాల సమస్యలను తెలుసుకున్నారన్నారు.
– వరంగల్ వాయిస్, వరంగల్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com